క్లుప్తంగా

కోనేరుకు మరమ్మతులు చేపట్టండి


శిథిలమైన దోబీ ఘాట్‌లతో ఉన్న కోనేరు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి ఎన్‌టీఆర్ కాలనీని ఆనుకుని రజకులకు ఆధారంగా ఉన్న పాత్రుని కోనేరుకు మరమ్మతులు చేయాలని రజకులు కోరుతున్నారు. కొన్నేళ్లుగా రజకులకు దోబీ ఘాట్‌లగా ఉపయోపడుతున్న ఈ కోనేరు ప్రస్తుతం ఘాట్‌లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో రజకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత్రుని కోనేరుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

టెక్కలి: టెక్కలి ఆర్డీవో కార్యాలయంలో సోమవారం యథావిధిగా పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల స్వీకరణ) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో కార్యాలయ సిబ్బంది ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో తాత్కాలికంగా నిలిపివేసిన పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని మళ్లీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా అమ్మవార్ల ఆలయ ప్రతిష్ట


అమ్మవార్ల ఆలయం

నందిగాం: మండలంలోని నరేంద్రపురంలో నూతనంగా నిర్మాణం చేసిన రెయ్యి బోడెమ్మ, భూలోకమాత అమ్మవార్ల ఆలయ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా యంత్ర ప్రతిష్ట, శిఖర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, కళా న్యాసం, ప్రాణప్రతిష్ట తదితర విశేష కార్యక్రమాలు బంకుపల్లి సంతోష్‌శర్మ, వైద్యభూషణ సత్యన్నారాయణ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే సంగీత నాథ నీరాజనం, కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు అలరించారు. వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

పోటెత్తిన భక్తులు


తులసమ్మ ఆలయం వద్ద భక్తజన సందోహం


ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజుల తులసమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిరూపం గజముద్దను మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు.

టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు


మాట్లాడుతున్న డాక్టర్ కె.లీల

వజ్రపుకొత్తూరు: పూండిలోని సాయివినీత్ విద్యా సంస్థల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ లీల మాట్లాడుతూ.. వ్యక్తి వికాసానికి విలువలతో కూడిన విద్య దోహద పడుతోందన్నారు. విద్యా సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ చాపర కోదండరావు, ప్రిన్సిపాల్ అన్నెపు కైలాశరావు, వైస్ ప్రిన్సిపాల్ బత్తిన శ్రీనివాసరావు, సాయిగోపాల్, ప్రదీప్, ధర్మారావు, ఎస్, షణ్ముఖరావు, డైరెక్టర్ కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సమావేశం


మాట్లాడుతున్న తేజేశ్వరరావు

ఇచ్ఛాపురం టౌన్: పట్టణంలోని ప్రైవేటర్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ నాయకులు ఆదివారం సమావేశమన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు సి.తేజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ అభివృద్ధి, కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై చర్చించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కృష్ణప్రసాద్, విజయానంద్, ఎ.రవిబాబ్జి, పి.తిరుపతిరావు, బి.నిర్మలా రెడ్డి ఉన్నారు.

ఉలకవు..పలకవు..!

- పని చేయని అగ్నిమాపక కేంద్రం ఫోన్లు
- రెండు నెలలుగా ఇదే పరిస్థితి
- వేసవిలో అగ్నిప్రమాదాలకు అవకాశం
- ఫోన్లు పని చేయకపోవడంతో ఆందోళన


సాంకేతిక కారణాలతో ఫోన్ నంబర్ పనిచేయని టెక్కలి అగ్నిమాపక కేంద్రం

టెక్కలి: అత్యవసర సమయాల్లో స్పందించాల్సిన అగ్నిమాపక కేంద్రం ఫోన్లు మూగబోయాయి. నెలల తరబడి పని చేయనప్పటికీ వాటిని వినియోగంలోకి తీసుకురావడంలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. వేసవిలో అత్యవసర ప్రమాదాల దృష్ట్యా ఫోన్లు వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. డివిజన్ కేంద్రమైన టెక్కలితో పాటు కోటబొమ్మాళి మండల కేంద్రాల్లోని అగ్నిమాపక కేంద్రం ఫోన్లు రెండు నెలలుగా పనిచేయడం లేదు. దీంతో అత్యవసర సమయాల్లో 101 సమాచారం ఇచ్చుకోవాల్సిన పరిస్థితి చోటు చేసుకుంటోంది. అయితే ప్రమాదాలు జరిగినపుడు అవగాహన ఉన్న వారు మాత్రమే టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇస్తున్నారు. అది కూడా టోల్‌ఫ్రీకు సమాచారం ఇచ్చిన తరువాత అక్కడ నుంచి సంబంధిత కేంద్రాలకు సమాచారం ఇచ్చే క్రమంలో కాలయాపన జరుగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

8 మండలాలకు ఇవే ఆధారం..

డివిజన్ కేంద్రమైన టెక్కలిలోని అగ్నిమాపక కేంద్రం సేవలు టెక్కలి, నందిగాం, పాతపట్నం, మెళియాపుట్టి మండలాలకు విస్తరించి ఉన్నాయి. ఈ కేంద్రానికి 08945–244277 నంబర్ కేటాయించారు. ఈ నంబర్ కొన్ని నెలలుగా సక్రమంగా పనిచేయడం లేదు. అలాగే కోటబొమ్మాళి మండల కేంద్రంలోని అగ్నిమాపక వాహనం సేవలను కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, సారవకోట, జలుమూరు మండలాలకు విస్తరించి ఉన్నాయి. ఈ కేంద్రానికి 08942–238659 నంబర్ కేటాయించారు. ఈ నంబర్ సైతం గత కొన్ని నెలలుగా పనిచేయడం లేదు. అయితే గత కొన్ని దశాబ్దాలుగా ఇవే నంబర్లు వినియోగంతో పాటు ప్రచారంలో ఉండడంతో అత్యవసర సమయాల్లో బాధితులు ఈ నంబర్లనే ఆశ్రయిస్తుంటారు. ప్రస్తుతం ఈ నంబర్లు పనిచేయకపోవడంతో ఆందోళన చోటు చేసుకుంటోంది. ఈ నంబర్లు పనిచేయకపోవడంతో ఆయా అగ్నిమాపక కేంద్రం అధికారుల వద్ద ప్రస్తావించగా.. కోటబొమ్మాళికి సంబంధించి అప్‌గ్రేడ్ నిమిత్తం ఫోన్ పని చేయడం లేదని, టెక్కలికి సంబంధించి కొన్ని రకాల సాంకేతిక కారణాలతో పనిచేయడం లేదని ఆయా అధికారులు వెల్లడించారు. ఏది ఏమైనప్పటికీ అత్యవసర సమయాల్లో సేవలు అందజేయాల్సిన అగ్నిమాపక కేంద్రం ఫోన్ నంబర్లు పని చేయకపోవడంపై స్థానికులు నివ్వెరపోతున్నారు.

పార్టీ పటిష్టతకు పాటుపడండి

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి తిలక్


మాట్లాడుతున్న పేరాడ తిలక్

నందిగాం: గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్టత కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. కణితూరులోని తన స్వగృహంలో నందిగాం మండల పరిధిలోని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ముఖ్య నాయకులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ ప్రజల పక్షాన నిలవాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని ప్రతిష్ట పరిచాలని, గ్రామకమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామస్థాయిలో పార్టీ సోషల్ మీడియా గ్రూపులు ఏర్పాటు చేసి వాటి ద్వారా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. అలాగే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ నెల 12న జరగనున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని, అలాగే ఫీజుపోరులో పెద్దఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు తమిరె పాల్గుణరావు, జడ్యాడ జయరాం, కణితి నారాయణమూర్తి, పోలాకి మోహనరావు, రేగల కూర్మారావు పాల్గొన్నారు.

విశ్రాంతి మండపం ప్రారంభం


విశ్రాంతి మండపాన్ని ప్రారంభిస్తున్న దేవదాస్‌రెడ్డి

కంచిలి: మండలంలోని ఎక్కల పంచాయతీ పరిధి అర్జునాపురం గ్రామంలో మండల పరిషత్ నిధులు నాలుగు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రజా విశ్రాంతి మండపాన్ని ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ రంగాల గ్రాయిత్రి, ఎంపీటీసీ సభ్యురాలు మెండ హైమావతి ఆధ్వర్యంలో స్థానికుల కోరిక మేరకు మండపానికి నిధులుకేటాయించినట్టు ఎంపీపీ చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రంగాల శ్రీనివాస్, మెండ ప్రకాష్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, పార్టీ నాయకులు దుర్గాసి ధర్మారావు, లడ్డు కేశవపాత్రో, ఉపసర్పంచ్ కిలుగు రాజు, కేసరపడ గ్రామ నాయకుడు కప్పల యుగంధర్, బెల్లుపడ సర్పంచ్ అయిధం జయరాం, రంగాల దీనబంధు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా మండపం పునఃప్రతిష్ట


స్వామివారిని దర్శించుకుంటున్న ప్రజాప్రతినిధులు

కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవమైన కవిటిలోని చంద్రశేఖరస్వామి ఆలయం మండపం పునఃప్రతిష్ట ఉత్సవం ఆదివారం సంప్రదాయబద్ధంగా జరిగింది. ఇందులో భాగంగా సుబ్రహ్మణస్వామి, గణపతి తదితర ఉపాలయాల్ని ఈ సందర్భంగా ప్రతిష్టించారు. వేడుకల్లో శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, కోఆప్షన్‌సభ్యుడు పాండవ శేఖర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బెందాళం రమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కవిటి, కొత్తూరు, గొండ్యాలపుట్టుగ, ప్రగడపుట్టుగ, రామయ్యపుట్టుగ, బొర్రపుట్టగ గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరం చేశారు.

సిక్కోలు వీరులు పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: ప్రజాకవి, రచయిత కుత్తుం వినోద్ రచించిన 'స్వాతంత్ర్యోద్యమంలో సిక్కోలు వీరులు'పుస్తకాన్ని పోర్ట్ బ్లేయిర్‌లో ఆదివారం ఆవిష్కరించారు. పలాస మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన వారు అండమాన్‌లో సిర్థపడ్డారు. ఈ సందర్భంగా తెలుగు సమాజం ఆధ్వర్యంలో ఆవిష్కరణ, పుస్తక పరిచయ కార్యక్రమం జరిగింది. ఆజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా 2023లో ప్రముఖుల చేతుల మీదుగా ఆవ్కిరించబడిన ఈ పుస్తకంలో మద్రాస్ ప్రెసిడెన్సీలో ఉమ్మడి గంజాం జిల్లాలో జరిగిన స్వాతంత్రోద్యమ పోరాటాన్ని పుస్తకానికి ఎక్కించారు. తెలుగు నేలపై జరిగిన స్వాతంత్ర్యోద్యమ పోరాటాన్ని ఉప్పు సత్యగ్రహం, మందస కాల్పులు, రైతుయాత్ర, కిసాన్ మహాసభ, గాంధీ పర్యటన మరెన్నో కీలక ఘట్టాలను పుస్తకంలో పొందుపరిచారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో కవి వినోద్ కుత్తుం మాట్లాడుతూ.. తెలుగు నేలతో నిత్యం అనుబంధాన్ని ఉంచుకుంటూ తెలుగు మాట్లాడే వారందరూ సంఘటితంగా ఉండడం సంతోషకరమని అన్నారు. తెలుగు గడ్డపై జరిగిన స్వాతంత్రోద్యమ పరిణామ ఘటనలను భావితరాలకు తెలియజేసేందుకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగం అన్నారు. తెలుగు సమాజం అధ్యక్షులు బత్తిని కూర్మారావు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన కుత్తుం వినోద్ ప్రజా కవిగా తన రచనలు, పాటలతో ప్రజలను చైతన్యం చేస్తుండడం నేటి యువతకు ఆదర్శవంతుడని అన్నారు. వినోద్‌ను అండమాన్ తెలుగు సమాజం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తిమ్మల సుందరరావు, తాళ వాసు, కుత్తుం ధర్మారావు, కోయిల రవి, తెప్పల హరికృష్ణ, బొడ్డు కామేష్, బత్తిని రాజు, కుత్తుం వాసుదేవ్, కొయిల దేవరాజు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయాలి


డ్యాన్స్‌తో అదరగొడుతున్న విద్యార్థులు

వజ్రపుకొత్తూరు: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారిని ఉన్నత పౌరులుగా ఎదిగేందుకు తల్లిదండ్రులు సైతం కృషి చేయాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు, సినీ హాస్య నటుడు మూల తాతయ్య అన్నారు.వివేకానంద–భారతీ విద్యా సంస్థల్లో ఆదివారం విద్యా తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలోని స్వామీ వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసిన అయన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. చిన్ననాటి నుంచే పిల్లలకు క్రమశిక్షణ అలవర్చాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పేరాడ సోమేశ్వరరావు, పాఠశాల వ్యవస్థాపకులు మెట్ట మోహనరావు, డైరెక్టర్ మెట్ట రవికుమార్, ప్రిన్సిపాల్ డి.వనజ నాభం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రాణప్రతిష్ట


పూజలందుకున్నస్వామివారు

సోంపేట: తాళ్లభద్ర గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. రుత్వికుల మంత్రోచ్చరణతో జరిగిన ప్రాణప్రతిష్టలో భక్తులు భక్తిపారవశ్యంలో మునిగి తేలారు. తాళ్లభద్ర పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా హైదరబాద్ సురభి కళాకారులచే నిర్వహించిన భక్తప్రహ్లాద నాటక ప్రదర్శన ఆకట్టుకుంది.

కాళీమాత ఆలయ వార్షికోత్సవం


కుంకుమపూజల్లో మహిళలు

ఇచ్ఛాపురం టౌన్: పట్టణంలోని డబ్బూరివీధిలో ఉన్న కాళీమాత ఆలయం, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కమిటీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం నిర్వహించిన కుంకుమ పూజల్లో అధికసంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. తెన్నెటి తేజేశ్వరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ


పరామర్శలో చైర్‌పర్సన్ విజయ

సోంపేట: కొర్లాం పంచాయతీకి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు తామాడ గణపతి భార్య భారతమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ గణపతి కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి


మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

కాశీబుగ్గ: కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం పలాస నియోజకవర్గ అధ్యక్షులు బమ్మిడి సంతోష్‌కుమార్ అన్నారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రూ.3,900 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉంటే బడ్జెట్‌లో రూ. 2,600 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. విద్యార్థుల సంఖ్యను సైతం కుదించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. తక్షణమే రీయింబర్స్‌మెంట్ బకాయి నిధులు విడుదల చేయాలన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన చేపట్టనున్న ఫీజు పోరు కార్యక్రమాన్ని విడుదల చేయాలని కోరారు.

ఆర్థిక సాయం


సంతబొమ్మాళి మండలం గోవిందపురం పంచాయతీ పంగజగ్గపేట గ్రామానికి చెందిన నిరుపేద నీలాపు చిన్నమ్మి ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటుంది. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ పునీత్‌రాజ్‌కుమార్ అసోసియేషన్ సభ్యులు అండగా నిలిచారు. 11 వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని చిన్నమ్మికి ఆదివారం అందజేసి ఆదర్శంగా నిలిచారు. అసోసియేషన్ అధ్యక్షుడు పుక్కళ నాగేంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

–సంతబొమ్మాళి

పల్లకీ వితరణ


కవిటి మండలం బెజ్జిపుట్టుగలోని చక్రధర పెరుమాళ్ స్వామికి ప్రగడపుట్టుగకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పి.బలరామ్మూర్తి రూ.2 లక్షల విలువైన గరుడ వాహన సేవ పల్లకీని వితరణ చేశారు. ఆదివారం పల్లకీకి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి శుద్ధి చేశారు. తమిళనాడులోని కుంభకోణంలో ఇత్తడి లోహంతో తయారీ చేయించారు. బ్రహ్మోత్సవాల తొలిరోజున ప్రత్యేక పూజలనంతరం ఆలయ అనువంశిక ధర్మకర్తలు పొందల కృష్ణారావునాయుడు, శ్రీరాంబాబునాయుడు, విజయకృష్ణ నాయుడుల సమక్షంలో ఆలయానికి అందించారు.

–కవిటి

అలరించిన కోయ నృత్యం


ఇచ్ఛాపురం మండలం బొడ్డబ్బాళి గ్రామంలో ఆదివారం ఘనంగా చింతామణి అమ్మవారి సంబర ఉత్సవాన్ని గ్రామస్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒడిశా సుర్లాకు చెందిన దామోధర కోయ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డప్పు వాయిద్యానికి అనుగుణంగా కోయరాజు, కోయరాణీలు పోటీపడి నృత్యం చేశారు.

–ఇచ్ఛాపురం రూరల్

సౌకర్యాలకు దూరంగా పలు వీధులు


కనీస సౌకర్యాలకు నోచుకోని అడ్డువాసవీధి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని 18, 19, 20 వార్డుల పరిధి రత్తకన్న గ్రామంలోని పలు వీధుల్లో కనీస సౌకర్యాలు, పారిశుద్ధ్యం సక్రమంగా లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా సీసీ రోడ్లు, కాలువలు, మంచినీటి సరఫరా, కుళాయిల్లేక, విద్యుత్ దీపాలు సక్రమంగా పనిచేయక ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నప్పటికీ పురపాలక సంఘం అధికారులు మాత్రం తనకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నిరుపయోగంగా ట్రాక్టర్!


సచివాలయం ఆవరణలో నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్

కవిటి: గ్రామాల్లో చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిధులతో కొనుగోలు చేసిన ట్రాక్టర్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. లక్ష్యం మంచిదే అయినప్పటికీ వినియోగించుకోవడంలో ఉద్యోగులు నిర్లక్ష్యంగా ఉంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. సీహెచ్ కపాసుకుద్ది గ్రామానికి లక్షలాది రూపాయల వ్యయంతో ట్రాక్టర్‌ను కేటాయించారు. అయితే దీన్ని వినియోగించకుండా నిరుపయోగంగా ఉంచేశారు. దీంతో టైర్లలో గాలితగ్గిపోయి..ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ పాడైపోతుంది. ఇప్పటికైనా సచివాలయ సిబ్బంది ట్రాక్టర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళలకు సన్మానం


మహిళా ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులను పాఠశాల కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ సభ్యులు ఆశి గౌరీశంకర్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరతో మద్యం అమ్మకాలు!

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని ఓ మద్యం దుకాణంలో ఉదయం, రాత్రి సమయంలో అమ్మకాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయి. ఉదయం పది గంటల్లోపు, రాత్రి తొమ్మిది గంటల అనంతరం బాటిల్‌పై 50 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నట్టు మద్యం ప్రియులు చెబుతున్నారు. అలాగే పలు చోట్ల బెల్టు షాపులు కూడా విచ్చలవిడిగా నడుస్తున్నాయన్నారు.